


# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## స్వతంత్రురాలు

**వసంత్ పోయి** పదిహేను రోజులైంది. ఇల్లంతా ఖాళీ అయింది.

"ఒక్కదానివే ఉండగలవా? పోనీ అమ్మని కొంతకాలం ఉండమంటావా?" వెళ్ళేప్పుడు అన్నయ్య సానుభూతిగా అడిగాడు.

నిరుపమ తల అడ్డంగా ఊపింది.

"వద్దు నాన్నకి ఇబ్బంది. "

"ఏమిటో వాళ్ళింట్లో అంతా అల్పాయుష్షులే" వదిన  చెప్పింది.

అంతా వెళ్ళిపోయారు.

వసంత్ ఏక్సిడెంట్‌లో పోయిన ఇరవైరోజులకి నిరుపమ మళ్ళీ ఆఫీస్‌కి వెళ్ళింది. అంతా ఆమె ఇంటికి వెళ్ళి పరామర్శించిన వాళ్ళే కాబట్టి, ఎవరూ ప్రత్యేకంగా ఓదార్పు మాటలు చెప్పలేదు. పనయ్యాక ఐదింటికి బైక్‌మీద ఇంటికి బయలుదేరింది. ఆ ఇంటి దగ్గరకి రాగానే ఆమె అప్రయత్నంగా బ్రేక్ వేసింది. ఆ చిన్న ఇంటిముందున్న చిన్న పంచలో ఆడుకుంటున్న నాలుగేళ్ళ బాబు తలెత్తి ఆమెవైపు చూసి నవ్వాడు. వాడి బట్టలు మాసి ఉన్నాయి. ఎప్పుడూ నీట్‌గా ఉండేవాడు. మురికిగా ఉన్నాడు.

రెండు నిమిషాల్లో తన ఇంటిముందు ఆగి నిరుపమ బైక్ తాళం పెట్టి, ఇంటి తాళం తీసి లోపలకి వెళ్ళి మంచం మీద వాలిపోయింది.

'తనెలా మర్చిపోయింది? తనకి ఎందుకు గుర్తు రాలేదు?' ఆమెకి ఊపిరాడనట్లుగా అనిపించింది.

'ఎంతపని చేసావు వసంత్! ఇప్పుడెలా?' గొణుక్కుంది. గంట తర్వాత లేచి మొహం కడుక్కుని బియ్యం కడిగి కుక్కర్ ఆన్ చేసింది. వదిన ఫ్రిజ్‌లో కూరలు నింపి వెళ్ళింది. త్వరగా పనవుతుందని వంకాయ కూర వండి, చారు పెట్టింది. టి.వి ఆన్ చేసి, కంచంలో అన్నం వడ్డించి తెచ్చుకుంది.

మొదటి ముద్ద నోట్లో పెట్టుకోగానే ఆ పిల్లవాడు గుర్తొచ్చాడు. 'వాళ్ళు ఏం తింటున్నారో!' అన్న ఆలోచన రాగానే తినలేకపోయింది. కనపడని సంకెళ్ళు తనని బంధించినట్లుగా ఫీలైన ఆమె కంచాన్ని సింక్‌లో పెట్టేసింది.

జిల్లా హెడ్ క్వార్టర్స్ ఐనప్పటికీ సిటీకి తక్కువ, టౌన్‌కి ఎక్కువలా ఉండే ఆ ఊళ్ళో నిరుపమ గవర్నమెంట్ ఉద్యోగంలో చేరినప్పుడు ఆమె కుటుంబ సభ్యులు, సంతోషం, విచారాలని సమానంగా అనుభవించారు. సంతోషం గవర్నమెంట్ ఉద్యోగం సాధించినందుకైతే, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్స్‌లాంటి వాళ్ళకి ఆ ఊళ్ళో ఉద్యోగాలు తక్కువ కాబట్టి, ఆమెకి పెళ్ళి చేయడం సమస్య అవుతుందేమో అని.

కానీ అదే ఊళ్ళో మరో గవర్నమెంట్ సంస్థలో ఆన్‌లైన్ వ్యవహారాలు చూసే వసంత్ సంబంధం వెతుక్కుంటూ వచ్చింది. ఒక్కడే కొడుకు. తల్లితండ్రులు పక్కన పల్లెటూరిలో ఉంటారు. వాళ్ళకి అభ్యంతరం చెప్పడానికి కారణం దొరకలేదు. ఆరునెలల్లో నిరుపమ పెళ్ళి వసంత్‌తో జరిగిపోయింది. ఆమె తండ్రి డౌన్ పేమెంట్ కట్టి కూతురికి ఓ ఇల్లు కొనిచ్చాడు. ఇ యం ఐలు నిరుపమ కట్టుకోవాలి. అలా ఆమె ఓ ఇంటిదైంది. అందులోనే కాపురం పెట్టారు.

వసంత్ సాత్వికుడు. అతనిలో ఎదురు చూసిన చిలిపితనం, సరసం, హాస్యం లాంటివి లేకపోయినా మృదుస్వభావి అవడంతో నిరుపమ సర్దుకుపోయింది.

వారి పెళ్ళయిన రెండేళ్ళకి అత్తమామలిద్దరూ ఆరునెలల తేడాతో అకస్మాత్తుగా పోయారు. తల్లితండ్రుల మరణం వసంత్‌ని ఇంకాస్త ముభావిగా మార్చింది. తండ్రిపోయిన మూడు నెలలకి వసంత్ భార్యతో చెప్పాడు.

"నీతో మాట్లాడాలి నిరుపమా."

"చెప్పు" టి.వి ఛానల్స్ మారుస్తూ చెప్పింది.

అతను ఆమె చేతిలోని రిమోట్‌ని తీసుకుని టి.వి ఆఫ్ చేసి చెప్పాడు.

"ఐ యాం సారీ. ఇది జీవన్మరణ సమస్య, కొంచెం శ్రద్ధగా వింటావా?"

"జీవన్మరణ సమస్యా?" నిరుపమ నిర్ఘాంతపోయింది.

"అవును. ఐయాం సారీ. నీతో కొద్దిగా మాట్లాడాలి."

"అన్నిసార్లు సారీలు వద్దు. విషయం ఏమిటి?"

వసంత్ తప్పుచేసిన పిల్లవాడిలా తలవంచుకుని చెప్పాడు.

"నేను సుందరిని ప్రేమించాను. ఆమెకి నేను తప్ప ఇంకెవరూ లేరు."

"ఏమిటి?" నిరుపమ విభ్రాంతిగా అడిగింది.

"సుందరి. మా ఊరి ఆచార్యులుగారమ్మాయి. వాళ్ళు చాలా పేదవాళ్ళు. మా ఇంటి పక్కన సగం కూలిపోయిన పెంకుటిల్లు ఉంది కదా? అది వాళ్ళ ఇల్లే. నాకు చిన్నప్పటి నించి సుందరంటే ప్రాణం. నీతో పెళ్ళి అన్నప్పుడు మా నాన్నకి చెప్పాను. కాని ఆయన ఒప్పుకోలేదు. 'బ్రాహ్మల పిల్లని చేసుకోవడం ఏమిటని తిట్టారు" వసంత్ గొంతు రుద్ధమైంది.

"మరి నాకు చెప్పాల్సిందిగా? నేనే నో చెప్పేదాన్ని" నిరుపమ అడిగింది.

"అప్పుడు ఇంకో సంబంధం చూస్తారు."

ఆ మాటలో 'ఏ రాయి అయితేనేం' అనే అర్ధం ధ్వనించి నిరుపమ మనసు బాధపడింది. తనలా వసంత్ ఇష్టంగా పెళ్ళి చేసుకోలేదు.

"సుందరి వాళ్ళ నాన్నని పిలిచి తిట్టారు. ఆయన అవమానంతో సుందరిని బయటకి రాకుండా బంధించారు. నీతో నా పెళ్ళి జరిగిపోయింది."

"ఇదంతా ఇప్పుడు ఎందుకు చెప్తున్నావు వసంత్?" నిరుపమ బలహీనంగా అడిగింది.

"ఇప్పుడు అమ్మా నాన్నా లేరు. నువ్వు విడాకులిస్తే నేను సుందరిని పెళ్ళి చేసుకుంటాను" గొణుగుతున్నట్లుగా చెప్పాడు.

"విడాకులా?"

"అవును. సుందరికి ఇంకా పెళ్ళి కాలేదు. చదువు లేదు. టెంత్ వరకే చదివింది. డబ్బు లేదు. దానికి తోడు నా గురించి పుకార్లు"

"సానుభూతా?"

"కాదు. ప్రేమ, ప్లీజ్."

"మరి నా సంగతేమిటి?"

వసంత్ మాట్లాడలేదు. తల దించుకుని ఉండిపోయాడు.

నిరుపమ దుఃఖం, ఉక్రోషంతో నిండిన కంఠంతో చెప్పింది.

"చచ్చినా ఇవ్వను. గవర్నమెంట్ ఎంప్లాయివి. ఆ అమ్మాయిని రెండో పెళ్ళి ఎలా చేసుకుంటావో చూస్తాను. నీవల్ల నా జీవితం నాశనమైపోయింది. నావల్ల నీ జీవితం కూడా నాశనమవనీ. నీకు డివోర్స్ ఇచ్చి నేను పొందే లాభం ఏమీలేదు. ఇలాగే ఉందాం. నీ పేరెంట్స్ లేరని తప్ప, నా ఫామిలీ గురించి వాళ్ళ గౌరవం గురించి నీకు ఆలోచన లేదు. నువ్వింత స్వార్ధపరుడివి అనుకోలేదు."

వసంత్ మౌనంగా లేచి తలుపు దగ్గరకి వేసి బయటకి నడిచాడు. నాలుగు రోజుల తర్వాత అడిగాడు.

"మన సందులో మనింటికి ఆరో ఇల్లు, చిన్న పెంకుటిల్లు. చూసిన గుర్తుందా?"

"ఎందుకు?"

"ఆ ఇంటిని కొన్నాను. ఈ శనివారం వెళ్ళి సుందరిని తీసుకొస్తున్నాను. తను ఆ ఇంట్లో ఉంటుంది."

నిరుపమ నిశ్చేష్టురాలైంది. మూడు రోజులుగా అతను మౌనంగా ఉంటే, ఆ ఆలోచన మానేసాడని అనుకుంది. పెళ్ళి చేసుకోకుండా కాపురం చేయడానికి ఏ అమ్మాయి ఒప్పుకుంటుంది అని కూడా అనుకుంది.

"వసంత్! నీకిదేమన్నా బావుందా? మన బజార్‌లోనే ఇంకో ఇల్లుకొని ఆమెని ఉంచితే సొసైటీలో ఏమనుకుంటారు?" అనునయంగా అడిగింది.

"సొసైటీ, పరువు, ప్రతిష్ట, కులం, డబ్బు.. విసిగిపోయాను. ఇకనించి ఏమీ పట్టించుకోదల్చుకోలేదు. నాకోసం, కేవలం నా కోసమే బతకాలనుకుంటున్నాను. నువ్వు విడాకులు ఇవ్వకపోయినా ఫర్వాలేదు. సుందరి నన్ను బాగా అర్థం చేసుకుంటుంది" వసంత్ స్థిరంగా చెప్పాడు.

నిరుపమ కళ్ళు విప్పార్చి అతనివంక చూస్తూండిపోయింది. 'ఈ మనిషి ఇంత స్వార్థపరుడా? భార్య గురించి పట్టదా?'

ఆ క్షణంలో ఆమె మనసు విరిగిపోయింది.

వసంత్ శనాదివారాలు కనిపించలేదు. సోమవరం రాత్రి తొమ్మిదికి ఇంటికి వచ్చాడు. నిరుపమ అన్నం తింటోంది. ప్లేట్ తెచ్చుకుని తనకి వడ్డించుకుంటూ చెప్పాడు.

"పెద్దగొడవ. చివరికి సుందరి అందర్నీ వదిలి కట్టుబట్టల్తో నాతో వచ్చేసింది. 'ఇంక మాకు నువ్వు చచ్చినట్లే' అని వాళ్ళ అమ్మా నాన్నలు తిట్టారు. ఇప్పుడు తనకి ఉన్నది నేను ఒక్కడినే"

" నీకూ అంతేగా? "

వసంత్ కళ్ళెత్తి ఆమె వంక చూసి "నిన్నెంత బాధపెడుతున్నానో నాకు తెలుసు. కానీ లైఫంతా యాంత్రికంగా జీవించలేను. అర్థం చేసుకో. సుందరి నా ప్రాణం. ఆమె లేకుండా ఉండలేను కాబట్టే ఈ నిర్ణయం తీసుకున్నాను" చెప్పాడు.

"పైగా మామగారు కూడా పోయారు" వ్యంగ్యంగా చెప్పింది

వసంత్ విషయం చూచాయగా తెలిసినా నిరుపమ వైపు వాళ్ళు గుంభనంగా ఉండిపోయారు. అది తాత్కాలిక ఆకర్షణ అని వాళ్ళు అనుకున్నారు. వసంత్ అప్పుడప్పుడు ఇంటికి వస్తాడు. ఓ రాత్రి పూట ఉండి వెళ్తాడు. నిరుపమ మనసు

రాయిపోయింది. అతను వచ్చినా, రాకపోయినా పట్టించుకోవడం మానేసింది. అతను వచ్చిన పూట అతనికి కూడా వంట చేస్తుంది. ఏదైనా చెప్దామంటే వినకుండా పుస్తకం పట్టుకుంటుంది.

'మనుషుల్లో ఇంత చెడ్డవాళ్ళుంటారా? ఇంత అవకాశవాదమా?' ఆమెకి ఆశ్చర్యంగా ఉంటుంది. ఒక్కోసారి విడాకులిచ్చేసి ఆ బంధంలోనుంచి తప్పుకుందాం అనిపిస్తుంది. కాని పగ, ద్వేషం దాన్ని అణచేస్తాయి.

ఆర్నెల్ల తర్వాత ఓ రోజు చెప్పాడు.

"సుందరి ప్రెగ్నెంట్."

నిరుపమ మనసు భగ్గుమంది.

"కంగ్రాచ్యులేషన్స్" పొడిగా చెప్పింది.

ఆ తర్వాత అతని రాకపోకలు తగ్గాయి.

ఓ రోజు ఆనందంగా స్వీట్ డబ్బా తెచ్చి చెప్పాడు.

"నాకు కొడుకు పుట్టాడు."

నిరుపమ అతనివంక పరిశీలనగా చూస్తూ అడిగింది.

"నీ మనస్తత్వం ఏమిటి వసంత్? మంచివాడివా? చెడ్డవాడివా? లౌక్యుడివా? కొడుకు పుట్టాడని స్వీట్స్ తెచ్చిస్తున్నావు. ఇంత దుర్మార్గమా? నేను తింటాననే అనుకుంటున్నావా? నిన్ను ఈ ఇంట్లోకి రానివ్వడానికి కారణం, నీకు విడాకులు ఇవ్వలేదు కాబట్టి. ఇంకో ముఖ్యమైన కారణం ఈ సోఫా, ఈ టి.వి లాగా నువ్వు కూడా నా దృష్టిలో మనిషివి కాదు. మనిషికి మనసు, స్పందించే గుణాలుంటాయి."

అతను మౌనంగా స్వీట్‌పాకెట్ తీసుకుని వెళ్ళిపోయాడు.

ఆమె ఆఫీస్ నించి వచ్చేప్పుడు ఆ ఇంటిదగ్గరకి రాగానే బైక్‌ని స్లో చేసేది తలుపు వేసి ఉండేది. గేట్ లోపల వసంత్ మోటార్ సైకిల్ కనిపించేది. కొత్తల్లో కోపం ఉవ్వెత్తున లేచేది. కాని తర్వాత నిర్లిప్తమైపోయింది.

ఆ చిన్న ఇంటిముందంతా శుభ్రంగా ఉండేది. అటూ ఇటూ పూలమొక్కలు మధ్యలో నడవడానికి బాట. అట్టే ఎత్తులేని కాంపౌండ్ వాల్. చిన్న చెక్క గేటు. రెండేళ్ళ తర్వాత చిన్నబాబు ఆ పంచలో రబ్బరు బొమ్మలతో ఆడుకోవడం చూసింది. ఇంటి తలుపు ఓరగా తీసి ఉంది. 'పసివాడిని అలా వదిలేస్తే, ఎవరైనా గేట్ తీసుకుని వెళ్ళి వాడిని ఎత్తుకు పోరా' అనిపించింది. మరుక్షణం తనకెందుకు అనుకుని వెళ్ళిపోయింది.

ఓ సాయంత్రం ఆమె ఆఫీస్‌నించి వచ్చే టైముకి వసంత్ వాడిని ఎత్తుకుని గేట్లో నిలబడి ఉన్నాడు. ఎక్కడికో వెళ్తున్నట్లుగా పిల్లవాడికి మంచి బట్టలు వేసి తల దువ్వి, పౌడర్ రాసారు. ఆమెని చూసి వసంత్ అప్రయత్నంగా నవ్వాడు. ఆమె బైక్ వేగం పెంచింది. వసంత్ తనని చూపించి ఆ బాబుకి ఏదో చెప్పడం రియర్ వ్యూ అద్దంలో గమనించింది.

ఆ తర్వాత వాడు ఆమెని చూడగానే చిరునవ్వు నవ్వడం ఆరంభించాడు. నిరుపమ దానికి స్పందించలేదు. కాని వారంలో ఆరురోజులు వాడి నవ్వు మొహం చూడడం ఆమెకి అలవాటైపోయింది. సుందరిని మాత్రం ఆమె ఎప్పుడూ చూడలేదు. చూడాలనే ఆసక్తి కూడా లేదు.

వసంత్ ఇంటికి రాకపోయినా ఇదివరకటిలా కోపం రావడంలేదు. 'నేను వద్దనుకున్నవాళ్ళు నాకూ వద్దు' అని ఆమె సెల్ఫ్ కౌన్సిలింగ్ చేసుకోవడం వల్ల విచారం లేదు.

మంచినీళ్ళ టేంకర్ గుద్ది వసంత్ అక్కడికక్కడే మరణించాడని తెలియగానే ఆఫీస్ వాళ్ళు నిరుపమని హాస్పిటల్‌కి తీసుకెళ్ళారు. కబురందిన ఆమె కుటుంబ సభ్యులంతా వచ్చారు. పోస్ట్‌మార్టం వ్యవహారాలు, దహన సంస్కారాలు వాళ్ళే చూసారు. ఐదేళ్ళ నుంచి అతనితో సంబంధ బాంధవ్యాలు లేకపోయినా వసంత్ దుర్మరణం నిరుపమని షాక్‌కి గురిచేసింది. ఆ మనిషికి ఎన్ని కలలు? ఎన్ని కోరికలు? ఒక్క నిమిషంలో అంతమయ్యాయి అనుకుంది.

ఇరవై రోజుల తర్వాత నిరుపమ మళ్ళీ ఆఫీస్‌కి వెళ్ళసాగింది.

మర్నాడు వసంత్ ఆఫీస్ నించి ఇద్దరు కొలీగ్స్ వచ్చి ఫేమిలీ పెన్షన్ ఫామ్స్ మీద నిరుపమ సంతకాలు తీసుకున్నారు. ఏక్సిడెంట్ అవడం వల్ల ఇన్సూరెన్స్ కూడా భారీగానే వస్తుందని వాళ్ళు చెప్పారు.

ఆఫీస్ నించి వస్తూ అలవాటుగా ఆ ఇంటిముందు బైక్ స్లో చేసింది. పూలమొక్కలన్నీ వాడిపోయాయి. తనని చూసి నవ్విన పిల్లవాడు అనారోగ్యంగా కనిపించాడు.

పగలంతా ఆఫీస్‌లో బిజీగా ఉన్నా ఇంటికి వచ్చాక ఆమె మనశ్శాంతిగా ఉండలేకపోయింది. 'ఇలా అర్ధాంతరంగా పోతే వాళ్ళు ఏమైపోతారన్న ఆలోచన లేదా వసంత్?' విసుక్కుంది.

మర్నాడు బాంక్‌కి వెళ్ళి ఏభై వేలు డ్రా చేసింది. ఆ నోట్ల కట్టని ఓ కవర్‌లో ఉంచి, ఓ క్షణం ఆలోచించి తెల్లకాగితం తీసుకుని సంబోధన లేకుండా ఉత్తరం రాసింది.

'ఈ ఏభై వేలు మీ ప్రస్తుత ఖర్చులకి ఉంచండి. వసంత్ పెన్షన్ ఎంత వస్తుందో ఇంకా తెలీదు. రాగానే ప్రతి నెల మీకే ట్రాన్స్‌ఫర్ చేస్తాను. మీకు బేంక్ అకౌంట్ ఉంటే ఆ వివరాలు నాకు ఇవ్వండి. ఇన్సూరెన్స్ డబ్బు, పిఎఫ్ లులాంటివి వచ్చాక వాటిని కూడా మీ అకౌంట్‌లో వేస్తాను.'

ఆ కాగితాన్ని కూడా కవర్‌లో ఉంచి అతికించింది.

ఇంటికి వెళ్తూ దారిలో ఆ ఇంటిముందు బైక్ స్లో చేసి ఆపింది. పిల్లవాడు ఆమెని చూసి నీరసంగా నవ్వాడు. ఇంటి తలుపు ఓరగా తీసి ఉంది.

వాడిని రమ్మన్నట్టుగా చేత్తో సైగచేసింది. వాడు ఓసారి తలుపు వంక చూసి రివ్వున పరిగెత్తుకొచ్చి చెక్క గేటుదగ్గర ఆగాడు. దానికి లోపల వైపు తాళం పెట్టి ఉందని గ్రహించి ఆ కవర్‌ని చెక్క బద్దీల మధ్యనించి లోపల వాడి చేతిలో పెట్టి చెప్పింది.

"దీన్ని మీ అమ్మకి ఇవ్వు."

వాడు తలుపు తోసుకుని ఇంట్లోకి వెళ్ళేదాకా ఆగి బైక్ స్టార్ట్ చేసింది.

ఆ రాత్రి నిరుపమ ప్రశాంతంగా భోజనం చేయగలిగింది. తనని బంధించిన కంటికి కనపడని సంకెళ్ళు విడిపోయినట్లుగా ఫీలైన ఆమె చాలా సంవత్సరాల తర్వాత కంటినిండా నిద్రపోయింది.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments